సాక్షి సూర్యాపేట

సోమవారం, 20, నవంబర్, 2023



ఉద్యోగులను కాపాడుకోవాలి

అధికారంలో ఎవరున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని సాక్షి పీపుల్స్ ఎజెండాలో ఉద్యోగులు వాపోయారు. - 10లో



ఉద్యోగాల కల్పనలో విఫలం

ఉద్యోగాల కల్పనలో బీఆర్ఎస్ విఫలమైందని టీఎస్ జేఏసీ-నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వంశీయాదవ్ అన్నారు. - 10లో



మట్టపల్లికి చేరుకున్న పాదయాత్ర

చెన్నైకి చెందిన భక్తులు చేపట్టిన మహా సంకల్పిత పాదయాత్ర ఆదివారం మట్టపల్లికి చేరుకుంది. - 10లో

న్యూస్‌రీల్

నేడు హాకీ, హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

మునగాల: ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ, హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సూర్యాపేట జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.ఆజంబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14,17వి భాగాల్లో బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. ఆసక్తి కల క్రీడాకారులు సోమవారం ఉదయం 9గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే వారైతే బోనోఫైడ్ సర్టిఫికెట్, పదవ తరగతి మార్కుల పట్టిక, పదో తరగతి చదువుతున్న వారైతే బోనోఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 99122 96412ను సంప్రదించవచ్చని సూచించారు.

విద్యతోనే సమాజంలో ఉన్నత విలువలు



ప్రైవేట్ విద్యాసంస్థల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నాగయ్య

కోదాడఅర్బన్ : విద్యతోనే సమాజంలో ఉన్నత విలువలు పెంపొందుతాయని ప్రముఖ వక్త, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర బాధ్యుడు అంబటి నాగయ్య అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో ఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి అధ్యక్షతన ప్రైవేట్ పాఠశాలల, జూనియర్, డిగ్రీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ సిబ్బందితో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రత, గౌరవ వేతనం, యాజమాన్యాలకు మున్సిపల్ పన్ను, విద్యుత్ చార్జీల్లో రాయితీలు, ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సంఘాల నాయకులు ముత్తినేని సైదేశ్వరరావు, శ్రీధర్, పాఠశాలల ఉపాధ్యాయుల కన్వీనర్ నాగమణి, కళాశాలల అధ్యాపకుల సంఘం బాధ్యులు చిలక రమేష్, ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్ఎస్ శ్రీనివాసరావు, అధ్యాపకులు గురవయ్య, రంగారావు, రమేష్, వీబీ వెంకటేశ్వర్లు, భిక్షమాచారి, నాగేశ్వరరావు, యాదగిరిరెడ్డి, సల్మా, కవిత, నజియా పాల్గొన్నారు.

సమాజ సేవ చేయడం అభినందనీయం



రిటైర్డ్ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం : పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి రిటైర్డ్ అయిన పోలీస్ సిబ్బంది సమాజ సేవ చేయడం అభినందనీయమని, రిటైర్మెంట్ అనేది వయసుకే కానీ.. మనసుకు కాదని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద రిటైర్డ్ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంఘం శాశ్వత భవనం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రిటైర్డ్ ఎస్ఐ రంగారెడ్డి, కార్యదర్శిగా రిటైర్డ్ ఎస్ఐ అబ్దుల్లా, కోశాధికారిగా కోటయ్య, సభ్యులుగా కృష్ణారెడ్డి, పెంచలయ్య, భాస్కర్‌రావు, గఫూర్, హుస్సేన్, రషీద్‌ఖాన్, శంకర్‌గౌడ్, అమృతారెడ్డి, సుగుణ, బాలకృష్ణ, వెంకటయ్యను ఎనుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్, ఆర్ఐ నారాయణరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధన, నిజాభిషేకం చేసి అర్చన గావించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయంలో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఓటు బదిలీ జరిగేనా..!

- ఒక పార్టీ నుంచి మరో పార్టీకి భారీగా వలసలు
- వలస నేతల బలమెంత.. వారి ద్వారా వచ్చే ఓట్లు ఎన్ని?
- వారు పార్టీలు మారితే ఓటర్లు మారుతారా..
- అభ్యర్థులను వెంటాడుతున్న ప్రశ్నలు

రాజకీయ పార్టీల్లో వలసల పరంపర కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి జిల్లాలో రాజకీయ పార్టీల్లో ఒక పార్టీ నుంచి ఇతర పార్టీలకు జంప్ జిలానీల సంఖ్య భారీగా పెరిగింది. ఆయా పార్టీల్లో నేతలపై వ్యతిరేకతతో కొందరు, టికెట్ ఆశించి రాకపోవడంతో మరికొందరు పార్టీ కండువాలు మార్చేశారు. అయితే, వలస పోతున్న నేతల వెంట ఓటు బదిలీ జరిగేనా అన్న సందిగ్ధత ఆయా పార్టీల అభ్యర్థుల్లో నెలకొంది.



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల షెడ్యూల్‌కంటే ముందే సిట్టింగ్‌లకే మళ్లీ టికెట్లు కేటాయించారు. దీంతో చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులపై వ్యతిరేకతతో నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వలస వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఖరారు తర్వాత అధికార పార్టీ నుంచి కూడా కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగాయి. ఇదే క్రమంలో కాంగ్రెస్‌లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతల తరఫు వారంతా అధికార పార్టీలో చేరారు. అదే విధంగా అనుకున్న వారికి టికెట్ రాకపోవడంతో మరో పార్టీలో చేరి టికెట్ పొందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా బీఆర్ఎస్‌లోకి వలసల పరంపర కొనసాగింది. మరోవైపు మొదట్లో వలస వెళ్లిన నేతలు కొంతమంది మళ్లీ తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు పార్టీ మారిన వారితోపాటు ఓటు బదిలీ ఎంత మేరకు జరుగుతుందన్నది ఇప్పుడు అభ్యర్థుల ముందు పెద్ద ప్రశ్నగా మారింది.

పార్టీలు మారిన నేతలు

ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నేతలు కూడా పార్టీలు మారారు. తద్వారానే టికెట్లను దక్కించుకున్నారు. వారితోపాటు ఆ నేతల వెంట కింది స్థాయి నాయకులు కూడా కండువాలు మార్చారు. నకిరేకల్‌లో బీఆర్ఎస్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం టిక్కెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి టికెట్ తెచ్చుకున్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్‌లోనే ఉన్న వీరేశం అనుచరులు, ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

- భువనగిరి నియోజకవర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన వెంట కొంతమంది కూడా గులాబీ కండువా వేసుకున్నారు. ఆ తర్వాత కొద్ది [illegible] రోజులకే ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. అంతేకాకుండా భువనగిరి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారంతా తిరిగి ‘హస్తం’ గూటికి చేరారు. ఇదే నియోజకవర్గంలో బీజేపీలో ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అయితే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్‌లోకి రావడంతో.. జిట్టా బీఆర్ఎస్‌లో చేరారు. కొన్ని రోజుల వ్యవధిలోనే వీరిద్దరు అటుఇటు మారడం చర్చనీయాంశమైంది.
- నల్లగొండ నియోజకవర్గంలో మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్న..బీఆర్ఎస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి వంటి నేతలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో ఉన్న మాజీ జెడ్పీటీసీ తండు సైదులు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. నల్లగొండ పట్టణంలోనూ 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరారు.
- మునుగోడులోనూ చివరి వరకు కాంగ్రెస్ టికెట్ ఆశించిన చలమల్ల కృష్ణారెడ్డి బీజేపీలో చేరడంతో ఆయన వర్గం కూడా బీజేపీలోకి పోయింది. దీంతో పాటు కృష్ణారెడ్డి బీజేపీ టికెట్ తెచ్చుకున్నారు. అక్కడ గత ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరి, టికెట్ దక్కించుకున్నారు. దాంతోపాటు గతంలో కాంగ్రెస్‌లో ఉండి, ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరిన నేతలు, ప్రజా ప్రతినిధులు కొందరు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
- తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో ఉన్న మందుల సామేలు కాంగ్రెస్ పార్టీలో చేరి టికెట్ తెచ్చుకున్నారు.
- హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్లలో కౌన్సిలర్‌గా ఉన్న చల్లా శ్రీలతారెడ్డి బీజేపీలో చేరి హుజూర్‌నగర్ టికెట్ తెచ్చుకున్నారు. కోదాడ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, సూర్యాపేట, దేవరకొండ నియోజకవర్గాల్లోనూ ఒక పార్టీ నుంచి మరో పార్టీకి భారీ ఎత్తున నేతలు, ప్రజాప్రతినిధుల వలసల పరంపర కొనసాగింది.

అంతుచిక్కని ఓటరు నాడి

పార్టీలు మారిన నాయకుల బలం ఎంత? పార్టీలు మారిన వారు చెబితే పడే ఓట్ల శాతం ఎంత? అన్న అనుమానాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయి. స్థానికంగా మండలాలు, గ్రామాలు, పట్టణాల్లో వారికి ఉన్న బలం ఎంత? అనే అంచనాల్లో అభ్యర్థులు పడ్డారు. స్థానిక నేతలు తమవైపు రావడంతో ఆయా ప్రాంతాల్లో అప్పటివరకు వారిని నమ్మిన ఓటర్లు ఇప్పుడు వారు మారిన పార్టీకి వేస్తారా? లేదా? అన్న ఆందోళన పలువురు అభ్యర్థుల్లో నెలకొంది. ప్రస్తుతం అన్ని పార్టీలు ప్రచారాలు ముమ్మరం చేశాయి. ఏ పార్టీ మీటింగ్ పెట్టినా జనాలు తండోపతండాలుగా సభలకు వస్తున్నారు. ఈ పరిస్థితులలో ఓటర్ల నాడి తెలియని పరిస్థితి ఉంది. ఎవరికి వారు తామే గెలుస్తామని బహిరంగంగా చెబుతున్నా లోలోపల ఆందోళనతోనే ఉన్నారు.

అభివృద్ధి చేసే వారికి మళ్లీ పట్టం కట్టాలి



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : అభివృద్ధి చేసే వారికి మళ్లీ పట్టం కట్టాలని, మీరు వేసిన ఓటుతోనే పదేళ్లలో సూర్యాపేట ఎంతో అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని నల్లాలబావి వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకుడు బిక్కుమల్ల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గతంలో హైదరాబాద్ మూసీ నీరు తాగే పరిస్థితి ఉండేదని, నేడు మిషన్ భగీరథ ద్వారా దేశంలోనే మొదటిసారిగా ఇంటింటికి తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు. గతంలో విద్యార్థులు దీపాల వెలుతురుతో చదువుకునే పరిస్థితులు ఉండేవని, నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం అని కొనియాడారు. నరేంద్రమోదీ రాష్ట్రమైన గుజరాత్‌లో సైతం ఇప్పటికి ప్రతిరోజు ఆరు గంటలే కరెంటు ఇస్తున్నారని తెలిపారు. 2014కు ముందు, ఆ తర్వాత జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని తమ ఓటు వేయాలన్నారు. వ్యాపారస్తులను గతంలో చందాల పేరుతో దందాలు నిర్వహించి బెదిరించే వారని, నేడు శాంతి భద్రతలతో ప్రశాంత వాతావరణంలో వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మొరిశెట్టి శ్రీనివాస్, ఉప్పల ఆనంద్, కాచం సత్యనారాయణ, బండారు రాజా, తోట శ్యాంప్రసాద్, చల్లా లక్ష్మీకాంత్, మీలా వంశీ, బెలిదే శ్రీనివాస్, నల్లపాటి శ్రీనివాస్, బిక్కుమళ్ల సోమేశ్వర్, దారం వెంకన్న, కక్కిరేణి చంద్రశేఖర్, రాచకొండ శ్రీనివాస్, ముప్పారపు నాగేశ్వరరావు, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై విశ్వాసం పెరిగింది

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఎం కేసీఆర్ సభలతో బీఆర్ఎస్ పై ప్రజలకు విశ్వాసం పెరిగి.. నమ్మకం కుదిరిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నిల ప్రచారంలో భాగంగా ఈనెల 21న సూర్యాపేటలోని నూతన వ్యవసాయ మార్కెట్ సమీపంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా స్థలిని మంత్రి పరిశీలించి మాట్లాడారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు, సూర్యాపేట అభివృద్ధికి ఏం చేస్తామనే విషయాన్ని, బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు సీఎం కేసీఆర్ వివరిస్తారని తెలిపారు. సీఎం సభలతో బీఆర్ఎస్ కు పెరిగిన ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకుల ముఖాల్లో ఫ్రస్టేషన్ కనబడుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలో 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీతో మాట్లాడించే ప్రతి అక్షరం అబద్ధమని చెప్పారు.



సూర్యాపేటలో సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నేడు నకిరేకల్, నల్లగొండలో సీఎం సభలు

- ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్న కేసీఆర్
- భారీ జన సమీకరణకు బీఆర్ఎస్ సన్నాహాలు



నల్లగొండలో ఏర్పాటైన సభావేదిక

నకిరేకల్, నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గులాబీ పార్టీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం నకిరేకల్, నల్లగొండకు రానున్నారు. నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో ఉన్న సువర్ణ గార్డెన్ సమీపంలో 15 ఎకరాల మైదానంలో మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించనున్నారు. అలాగే సాయంత్రం 4గంటలకు నల్లగొండలోని మర్రిగూడ బైపాస్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ మేరకు రెండు చోట్ల బీఆర్ఎస్ పార్టీ నకిరేకల్, నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థులు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు కూర్చునేలా సభావేదికలు నిర్మించారు. హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. నకిరేకల్ సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు మూసీ రోడ్డుతోపాటు, మార్కెట్, మెయిన్, తిప్పర్తి, తాటికల్ రోడ్లలో వివిధ చోట్ల స్థలాలను కేటాయించారు. అలాగే నల్లగొండకు వచ్చే వాహనాల కోసం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ఉత్తరం వైపు పార్కింగ్ స్థల ఏర్పాటు చేశారు. ఈ రెండు సభలకు ఆయా నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి.

ఇంటింటా పోల్ చిట్టీల పంపిణీ

- పోలింగ్ నిర్వహణకు పది రోజుల గడువు
- పోల్ చిట్టీలపై సమగ్ర సమాచారం
- జిల్లా ఓటర్లు 9,85,962 .. పోలింగ్ కేంద్రాలు 1,201



ఆత్మకూర్ (ఎస్) మండలం మక్తకొత్తగూడెంలో ఓటర్ స్లిప్పులు పంచుతున్న బీఎల్ఓ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మరో పది రోజుల్లో శాసనసభ ఎన్నికల ప్రధాన ఘట్టం పోలింగ్ జరగనుంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఇంటింటికీ పోల్ చిట్టీల పంపిణీని ఆరు రోజుల క్రితం ప్రారంభించారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 9,85,962 మంది ఓటర్లు, 1,201 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

సమగ్ర సమాచారంతో..

ఓటర్లు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఓటర్లకు పంపిణీ చేసే స్లిప్పులో సమగ్ర సమాచారం పొందుపర్చింది. గతంలో క్రమసంఖ్య, ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, వయసు, లింగం, ఇంటి నంబర్ ఉండేవి. ప్రస్తుతం ఏ4 సైజులో పోలింగ్ స్లిప్పు ఉంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్‌స్లిప్పులో పూర్తి సమాచారం స్పష్టంగా కన్పించేలా ముద్రించి ఓటరుకు అధికారులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేస్తున్న స్లిప్పులో ముందు భాగంలో ఓటర్ ఫొటోతో పాటు, ఎపిక్ నంబర్, సంరక్షకుడి పేరు, నియోజకర్గం, రాష్ట్రం పేరును ముద్రించారు. స్లిప్పు వెనుక భాగంలో ఓటర్ ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లే దారి పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉన్నది అనేది గుగూల్ మ్యాప్‌తో ముద్రించారు. అనుమానాలు నివృత్తి చేసుకోవడానికి బూత్‌స్థాయి అధికారి పేరు, ఫోన్ నంబర్‌కూడా ముద్రించారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు కన్పించే ప్రత్యేక ఏర్పాట్లతో నిబంధనలు కూడా పొందుపర్చారు. ఓటర్ సిప్పులతోపాటు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాని వెళ్లే ఓటరు పాటించాల్సిన జాగ్రత్తలతో ఎన్నికల సంఘం రూపొందించిన నియమాలు తెలుసుకునేందుకు ముద్రించిన గైడ్ పత్రాన్ని ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. ఈ గైడ్‌లో పోలింగ్ తేదీ, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వస్తువులు, అనుమతించని వస్తువులు, ఓటు వేసే విధానం, ఓటు వేసిన తర్వాత ఈవీఎంలో వచ్చేశబ్దం, ఓటు ఎవరికి వేశామనే విషయాలను గైడ్ పత్రంలో సమగ్రంగా ముద్రించారు. గతంలోనే వీవీ ప్యాట్ ల ఉపయోగం, ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఓటు హక్కువినియోగించుకునేలా..

ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి చిట్టీలు పంపిణీ చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారు పోలింగ్ కేంద్రాల వారీగా ముద్రించిన పోల్ చిట్టీలను పంపిణీ చేస్తున్నారు. పోల్ చిట్టీ పై బీఎల్ఓ సంతకం తీసుకొని రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. ఇల్లు మారిన వారు, బీఎల్ఓ వెళ్లినప్పుడు ఇంట్లో లేని వారు.. పోలింగ్ కేంద్రం వద్ద చిట్టీలు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ ఆ సమయంలో ఏదైనా గుర్తింపు కార్డు ఉంటే పోలింగ్ స్టేషన్ నంబరు ఇస్తారు.

22 వరకు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈ నెల 22 వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డి, నాలుగు నియోజకవర్గాల ఆర్ఓలు, ఏఆర్ఓలతో వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజక వర్గాల్లో ఓటర్ స్లిప్పులు పంపిణీ ప్రక్రియ మరింత వేగం పెంచాలన్నారు. పోలింగ్ రోజున వికలాంగులు, అంధులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండాలని సూచించారు. ఇప్పటికే 1,201 పోలింగ్ కేంద్రాల్లో 728 వీల్ చైర్స్ అందుబాటులో ఉంచామని, అలాగే వీరికి సేవలందించేందుకు వలంటీర్లను నియమించడంతో పాటు ఆటోలను సమకూరుస్తామన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ల సెల్ నంబర్లు ఆయా నియోజక వర్గాల్లో అందరికీ అందుబాటులో ఉండాలన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతోంది

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్

హుజూర్‌నగర్ : తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతోందని హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ పెన్షనర్ పి.చంద్రశేఖర్ తల్లి సత్యవతి జయంతిలో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పెన్షనర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు 80 నుంచి 85 సీట్లు రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర స్థాయిలో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు రాష్ట్రం అప్పు రూ.69 కోట్లుండగా నేడు అది రూ. 5 లక్షల కోట్లకు చేరిందన్నారు. కమీషన్లు విపరీతమైనందున మేడిగడ్డ కుంగిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి తాండవిస్తోందని, విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, సోమయ్య, కొప్పుల వీరారెడ్డి, కేవీఎస్ మూర్తి, ఎంఎస్ఎన్ రాజు, లక్ష్మారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పోలింగ్ లక్ష్యం

- ఓటు హక్కు వినియోగంపై ఓటర్లలో చైతన్యం
- ప్రత్యేక కార్యక్రమాల రూపకల్పన
- సాంస్కృతిక కళాజాతలతో అవగాహన



జిల్లా కేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు (ఫైల్)

గత మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతం వివరాలు			
నియోజకవర్గం	2009	2014	2018
హుజూర్‌నగర్	78.01	81.19	86.96
కోదాడ	76.95	84.38	89.49
సూర్యాపేట	69.42	78.88	87.16
తుంగతుర్తి	76.49	77.74	86.34

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఓటు హక్కున్న ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రజలకు వివరిస్తున్నారు. ఓటర్లలో చైతన్యం తెచ్చేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే గత మూడు దఫాల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే పల్లెలు, తండాలు ఎక్కువగా ఉండే హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో అత్యధికంగా ఓటింగ్ నమోదైంది. ఉద్యోగులు, విద్యావంతులు, కార్మికులు, వలస జీవులు అధికంగా ఉండే సూర్యాపేటలో మాత్రం తక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

క్రమంగా పెరుగుతున్న పోలింగ్ శాతం..

గత మూడు ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ నమోదు శాతం పెరిగింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2009లో 78.01శాతం పోలింగ్ కాగా 2014లో 81.19శాతం, 2018లో 86.96శాతం ఓట్లు పోలయ్యాయి. కోదాడ నియోజకవర్గంలో 2009లో 76.95శాతం ఓట్లు పోల్ కాగా 2014లో 84.38శాతం, 2019లో 89.49శాతంగా నమోదైంది. ఇక సూర్యాపేట నియోజకవర్గంలో 2009లో 69.42శాతం, 2014లో 78.88 శాతం, 2019లో 87.16 శాతం పోలింగ్ నమోదైంది. తుంగతుర్తి నియోజకవర్గంలో 2009లో 76.49 శాతం ఓట్లు నమోదు కాగా 2014లో 77.74 శాతం, 2019లో 86.34 శాతం ఓట్లు పోలయ్యాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువపై..

గత ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సరాసరి 87.48 శాతం ఓట్లు పోలయ్యాయి. హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో దాదాపు సమానంగా పోలింగ్ శాతం నమోదైంది. ఇక సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని అర్బన్ ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ శాతం, రూరల్ మండలాల్లో ఎక్కువ శాతం పోలింగ్ నమోదైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈసారి 100 శాతం పోలింగ్ ఉండేలా అధికారులు నిర్దేశించుకున్నారు. ఈమేరకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగానికి ఉన్న విలువలను తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు రూపొందించారు. ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పిస్తున్నారు. బస్టాండ్, కూడళ్లు, మార్కెట్ యార్డులు, విద్యా సంస్థల్లో సాంస్కృతిక కళాజాతలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఎన్నికల చిత్రాలు

● ప్రచారంలోనే సాపాటు..


ప్రచారంలో భాగంగా హుజూర్‌నగర్‌లో రోడ్డు పక్కన బండి వద్ద టిఫిన్ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

● నీకు నేనున్నా అక్కా..


బొమ్మలరామారం మండలంలో మహిళకు భరోసా ఇస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

● శ్రామిక నేత


అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెంలో వెల్డింగ్ చేస్తున్న సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి

● తాతామనుమళ్లు.. ప్రచార సారథులు


సూర్యాపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి కుమారుడు వేమన్‌రెడ్డి, తండ్రి రామచంద్రారెడ్డి

● పెళ్లి వేడుక.. 'గ్యారంటీ'ల కానుక


కనగల్ : పెళ్లి మండపంలో వధూవరులకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల కరపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగులను కాపాడుకోవాలి

జంగ్ తెలంగాణ

- సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి
- పెండింగ్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తే మంచిది
- పెండింగ్ డీఏ, పీఆర్‌సీలు చెల్లించాలి
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలి

'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో ఉద్యోగుల డిమాండ్

ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అది విజయవంతం కావాలంటే ఉద్యోగులే కీలకం. కానీ, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు షరా మామూలే అన్నట్లుగా ఉంటున్నాయి. వారి సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం స్థానిక టీఎస్‌జీఓ భవన్‌లో వివిధ శాఖల ఉద్యోగులతో 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

– ఆవుల లక్ష్మయ్య, నల్లగొండ టౌన్


పీపుల్స్ ఎజెండాలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

పీపుల్స్ ఎజెండా

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగులు చేసిన ఉద్యమానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి ఐదేళ్ల కాలంలో 73 శాతం ఫిట్‌మెంట్‌ను ఇచ్చింది. మూడు పెండింగ్ డీఏలను విడుదల చేసి ఉద్యోగులకు అక్కున చేర్చుకుంది. కానీ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు అనేవి నిరంతరం ఉంటున్నాయి. వాటిని కూడా ప్రభుత్వం దశల వారీగా పరిష్కరించి అండగా నిలవాలని ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు. ఉద్యోగులను కంటికి రెప్పాలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని పేర్కొంటున్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని ఉద్యోగులంతా ముక్త కంఠంతో కోరుతున్నారు.

కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి



వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలి. ఎన్నో ఏళ్లుగా ఏఎన్‌ఎంలు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారు. ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలి.

– శేఖర్‌రెడ్డి, టీఎస్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు

హెల్త్ స్కీమ్‌ను పక్కాగా అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను పక్కాగా అమలు చేయాలి. ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.. అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– మాధవి, టీఎస్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి



రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. ప్రస్తుతం అమలు చేస్తున్న సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుంది.

– కంచనపల్లి కిరణ్‌కుమార్, టీఎస్‌జీఓ జిల్లా కార్యదర్శి

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలను చెల్లించాలి. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఉద్యోగుల సమస్యలు నిరంతరం ఉంటాయి వాటన్నింటని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

– మంత్రవాది శ్రవణ్‌కుమార్, టీఎస్‌జీఓ అధ్యక్షుడు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. కాంట్రాక్ట్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ కార్యదర్శులుగా నియమించాలి. వీఆర్‌ఏ, వీఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలి.

– దయాకర్‌రావు, టీఎస్‌జీఓ అసోసియేట్ అధ్యక్షుడు

317 జీవోను రద్దు చేయాలి



317 జీవో కింద ఉద్యోగులను 300 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్ల వరకు బదిలీ చేశారు. ఆ జీవోను వెంటనే రద్దు చేసి ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురావాలి.

– జయారావు, టీఎస్‌జీఓ జిల్లా కోశాధికారి

పెండింగ్ డీఏలు, పీఆర్‌సీలు ఇవ్వాలి



ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏలు, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలి. ఉద్యోగుల సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడాలి.

– ఆకునూరి లక్ష్మయ్య, టీఎస్‌జీఓ పట్టణ అధ్యక్షుడు

ఉద్యోగులపై కరుణ చూపాలి



ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించి వారితో సక్రమంగా పని చేయించుకోవాలి. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలోకి పోవాలంటే ఉద్యోగులదే కీలక పాత్ర ఉంటుంది. ఉద్యోగల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలి.

– వంగూరు విజయకృష్ణ, సహకార శాఖ ఉద్యోగి

కనీస వేతనం అమలు చేయాలి



అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.22 వేలను అమలు చేసి హెల్త్ కార్డులను అందించాలి. ఉద్యోగ విరమణ సమయంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– పుట్టా సునీత, అంగన్‌వాడీ ఉద్యోగి

మహిళా ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలి



మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి సమస్యలను పరిష్కరించడం ద్వారా మహిళా ఉద్యోగుల్లో మనో స్థైర్యాన్ని నింపాలి.

– రమాదేవి, టీఎస్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షురాలు

ఉద్యోగాల కల్పనలో విఫలం


అర్వపల్లిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు

● నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

అర్వపల్లి : నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీఎస్ జేఏసీ-నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నోముల వంశీయాదవ్ అన్నారు. ఆదివారం అర్వపల్లిలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం నిరుద్యోగ భృతిని చెల్లించకపోగా సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు మొండిచేయి చూపించారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, నిరుద్యోగ జేఏసీ నాయకులు సురేష్, శేఖర్, సిద్ధు, శ్రీకాంత్, కళింగం, సోమశేఖర్, తిరుమలేష్, రాహుల్, చందు, మహేష్, కాంగ్రెస్ నాయకులు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మోరపాక సత్యం, మహరాజు, రాంబాబు, కార్తీక్, నగేష్ పాల్గొన్నారు.

● ఓటు హక్కు వినియోగించుకుందాం..



ఓటు హక్కు వినియోగించుకోవాలని భువనగిరిలో అవగాహన కల్పిస్తున్న సాబ్ వీ సర్వ్ ఫర్ హ్యుమానిటీ సొసైటీ ప్రతినిధులు

ఓటరు కార్డుకు లేఖ జతచేసి..

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికలు సమీపిస్తుండడంతో కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం రూపొందించిన కొత్త కార్డులను పోస్టాఫీస్‌ల ద్వారా ఓటరు ఇంటికి చేర వేస్తున్నారు. ఇంతకు ముందు ఉన్న ఓటరు గుర్తింపు కార్డు బ్లాక్ అండ్ వైట్‌లో ఉండేది. ఇప్పుడు కలర్‌తో ముద్రించి అందజేస్తున్నారు. దీనిపై క్యూఆర్ కోడ్ సైతం ఉంటుంది. పోలింగ్ కేంద్రం వివరాలు, ఓటరు చిరునామా తదితర వాటిని ముద్రించారు. ప్రస్తుతం గుర్తింపు కార్డుతో పాటు ఓటు హక్కును వినియోగించుకోవాలనే సందేశం, ప్రతిజ్ఞతో కూడిన లేఖలను సైతం పంపిస్తున్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ హక్కును వినియోగించుకోవాలని అందులో సూచిస్తున్నారు.


ఓటరు గుర్తింపు కార్డు

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, 20 పట్టుచీరలు ఎత్తుకెళ్లిన దుండగులు

కోదాడరూరల్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు పట్టుచీరలను దొంగలించారు ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని శివసాయినగర్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివసాయినగర్‌లో నివాసముండే రావుల గంగయ్య ఈ నెల 17న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో పార్కింగ్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్(బుల్లెట్) బైక్‌తో పాటు పగలకొట్టి బీరువాలో ఉన్న 20 పట్టుచీరలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు గుర్తించారు. దీంతో గంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో ఆంగ్లభాషా నైపుణ్యం పెంచాలి

నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆంగ్లభాషా (ఇంగ్లిష్) మాట్లాడే నైపుణ్యం పెంచాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామచందర్ అన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ సహకారంతో విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యాయులకు కొనసాగుతున్న 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం నల్లగొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఒకరోజు ఫిజికల్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా చేయాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ ద్వారా మెళకువలు నేర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 600 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు. ప్రతి విద్యార్థి తెలుగు మాట్లాడినట్టుగా ఇంగ్లిష్ మాట్లాడేలా చేయడానికి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విల్ టు కెన్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తెలంగాణలో 20 జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, సైదులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

21, 22 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు శిక్షణ

● నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్

నకిరేకల్: ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాలును నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. ఆదివారం నకిరేకల్‌లోని గురుకుల బాలికల కళాశాలలో శిక్షణకు సంబంధించిన జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి ఆర్‌ఓ హేమంత్ కేశవ్ పాటిల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఓపీఓలకు ఈనెల 25న శిక్షణ ఉంటుందన్నారు. తమకు కేటాయించిన తేదీల్లో ఆర్డర్ ప్రకారం సిబ్బంది హాజరు కావాలన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారి ప్రసాద్ నాయక్ తదితరులు ఉన్నారు.


నకిరేకల్‌లో శిక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్, ఆర్‌ఓ

వెలిమినేడును మండలంగా ప్రకటించాలి

చిట్యాల: వెలిమినేడు గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం వెలిమినేడు గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారం నకిరేకల్‌లో జరగనున్న ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌తో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెలిమినేడును మండలంగా ప్రకటింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి గౌరవాధ్యక్షుడు దేశబోయిన నర్సింహ, అధ్యక్షుడు పోలగోని శివప్రసాద్, సభ్యులు ఆడేపు మహేష్, కూనురు గణేశ్, గోలి సాయికిరణ్, పోలగోని విజయ్‌ప్రసాద్, దత్తాద్రి, చింటు, ప్రసాద్, శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల సాధన సమితి సభ్యులు

మట్టపల్లికి చేరిన మహా సంకల్పిత పాదయాత్ర


మట్టపల్లికి చేరుకున్న భక్తులు, నరసింహస్వామి మాలధారులు

మఠంపల్లి: తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన శ్రీముక్కూరు లక్ష్మీనసింహచారియర్ భక్తులు చేపట్టిన మహా సంకల్పిత పాదయాత్ర ఆదివారం రాత్రి మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి చేరుకుంది. శనివారం రాత్రి చెన్నై నుంచి కోదాడకు చేరుకున్న భక్తులు ఆదివారం ఉదయం అక్కడ నరసింహస్వామి మాలధారులతో కలిసి పాదయాత్రను ప్రారంభించి రాత్రికి మట్టపల్లికి చేరుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో పాల్గొన్న అర్చనాదేవి

హుజూర్‌నగర్ : విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం 125 శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో హుజూర్‌నగర్‌కు చెందిన కవి, రచయిత, సామాజిక కార్యకర్త, శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షురాలు శ్రీపాద అర్చనాదేవి కవితా గానం చేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను శాలువ, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


అర్చనాదేవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

● క్రికెట్ ఫీవర్


సూర్యాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లిలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూస్తున్న వధూవరులు, బంధువులు


సూర్యాపేటలో సెలూన్ షాపులో వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ చూస్తున్న క్రికెట్ అభిమానులు


సూర్యాపేట పట్టణంలోని ఓ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై మ్యాచ్ చూస్తున్న విద్యార్థులు


సంస్థాన్ నారాయణపురంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై మ్యాచ్ చూస్తున్న గ్రామస్తులు